AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

18-12-2025 (Thursday) MAIN EDITION

## ఒమన్‌లో ప్రధాని మోదీ పర్యటన..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఒమన్‌లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఒమన్ ఉప ప్రధాని సయ్యద్ షిహాబ్ బిన్ తారిఖ్ అల్ సైద్‌తో సమావేశం అయ్యారు. ఆ దేశ ఉప ప్రధానితో పలు ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై చర్చించారు. ఇరు దేశాల మధ్య మైత్రి బంధం బలోపేతం అవుతుందన్నారు. భారత్ ఆర్థికంగా వేగంగా పురోగమిస్తోందని మోదీ తెలిపారు. గత 12 ఏళ్లలో మౌలిక సదుపాయాలు ఐదు రెట్లు మెరుగయ్యాయని చెప్పారు. అలాగే ఒమన్‌లో జరిగిన మైత్రి పర్వ్ కార్యక్రమంలో గురువారం మోదీ భారతీయులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

## ఎన్నికల కోడ్‌పై ఎస్ఈసీ కీలక ప్రకటన




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. దీంతో ఎలక్షన్ కోడ్‌పై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. సాయంత్రం 5 గంటలకు ఎన్నికల కోడ్ ముగియనుందని తెలిపింది. ఎన్నికల నిర్వహణకు సహకరించిన ప్రభుత్వానికి ధన్యావాదాలు తెలిపింది. కోడ్‌ను సమర్థంగా అమలు చేసిన అధికారులకు ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రాణికుముదిని అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన ఇద్దరు అధికారుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ఇచ్చి ఆదుకుంటామని చెప్పారు.

## కష్టకాలం ముగిసింది: ఇండిగో సీఈవో



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇండిగో సంక్షోభం సమయంలో తమకు అండగా నిలిచిన సిబ్బందికి విమానయాన సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ ధన్యవాదాలు తెలిపారు. ఇండిగో ఉద్యోగులను ఉద్దేశిస్తూ ఓ వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎయిర్‌లైన్ రోజువారీ సర్వీసులు పునరుద్ధరించామని ఆయన వెల్లడించారు.

## మా పోటీ 'డీఎంకే'తోనే: విజయ్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** తమిళనాట రాజకీయ అరంగేట్రం చేసిన టీవీకే అధినేత దళపతి విజయ్ సంచలన కామెంట్స్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో డీఎంకేపై ధ్వజమెత్తారు. డీఎంకేను దుష్టశక్తిగా అభివర్ణించారు. టీవీకేను పవిత్ర శక్తిగా చెప్పుకొచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజమైన పోటీ పవిత్ర శక్తి - దుష్టశక్తి మధ్యనే ఉంటుందన్నారు.


## వన్‌ప్లస్ నుంచి శక్తిమంతమైన ఫోన్..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ వన్‌ప్లస్.. తాజాగా మరో మోడల్‌ను లాంచ్ చేసింది. మిడ్‌రేంజ్‌లో భారీ బ్యాటరీతో వన్‌ప్లస్ 15ఆర్ మోడల్‌ను తీసుకువచ్చింది. ఇది ప్రపంచంలోనే స్నాప్‌డ్రాగన్ 8 జెన్ 5 ప్రాసెసర్‌ను ఉపయోగించిన తొలి మోడల్ అని కంపెనీ పేర్కొంటోంది. ఈ నెల 22వ నుంచి సేల్స్ ప్రారంభం కానున్నాయి.

**రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. మూడు దశల్లో నిర్వహించిన పల్లె పోరు విజయవంతంగా ముగిసింది. దాదాపుగా 20 నెలల నుంచి బోసిపోయిన గ్రామాలకు కొత్త సర్పంచులు వచ్చారు. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ హవా కొనసాగింది. ఆ పార్టీ మెజారిటీ స్థానాల్లో విజయం సాధించింది. దీంతో త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.** – అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# మరో పోరుకు సై..




- త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు!
- నెలాఖరులోగా నోటిఫికేషన్ వచ్చే అవకాశం
- పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా
- అదే ఊపులో ఎన్నికలు నిర్వహించే యోచన

పంచాయతీ ఎన్నికల్లో గెలుపుతో ఊపు మీదున్న కాంగ్రెస్ అదే జోష్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని చూస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. మొత్తం 12,776 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగగా.. 6,782 స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు. 3,500 బీఆర్ఎస్ మద్దతుదారులు, 695 స్థానాల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు. 1,651 స్థానాల్లో ఇతరులు విజయం సాధించారు.

### జోష్‌లో కాంగ్రెస్

పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఇదే ఊపులో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో కాంగ్రెస్‌కు మేలు జరుగుతుందని నాయకులు ఆలోచిస్తున్నారు. ఇప్పటికే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితాను అధికారులు రూపొందించారు. దీంతో త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నెలాఖరు వరకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది.

### తేలని రిజర్వేషన్ల పంచాయితీ

అధికారంలోకి వస్తే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పింది. ఈ మేరకు బిల్లులను అసెంబ్లీలో ఆమోదించిన కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ గతంలో జీవో జారీ చేసింది. ఈ జీవో ఆధారంగా గతంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ కూడా విడుదల అయింది. అయితే జీవోను కోర్టు రద్దు చేయడంతో ఆ ఎన్నికల నోటిఫికేషన్‌ను కూడా ఈసీ వెనక్కి తీసుకుంది. అనంతరం ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు లేకుండానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. పార్టీ పరంగా బీసీ రిజర్వేషన్లు ఇస్తామని చెప్పినా.. అది ఎంతవరకు అమలు అయ్యిందో ఎవరు చెప్పలేని పరిస్థితి ఉంది. కోర్టు విచారణ అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తామని గతంలో ప్రభుత్వం తెలిపింది.

### ప్రభావం చూపని రిజర్వేషన్ల అంశం

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశం ప్రభావం చూపలేదు. గ్రామాల్లో ప్రజలు దాని గురించి చర్చించకుండానే.. ఎన్నికల్లో పాల్గొన్నారు. దీంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు సైతం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా.. తాము హామీ ఇచ్చిన బీసీ రిజర్వేషన్ల అంశం ఇప్పట్లో తేలే అవకాశం లేదు. దీంతో పార్టీ పరంగా రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి.. ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. అయితే స్థానాల రిజర్వేషన్లు ఖరారు చేశాక.. నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

### ఆశావహుల నిరీక్షణ

రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం గతేడాది జూన్ నెలతో ముగిసింది. దీంతో అప్పటి నుంచి ఎన్నికల కోసం నాయకులు ఎదురు చూస్తున్నారు. తాజాగా గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగియడంతో ఆశావహులు టికెట్ల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. తమకు టికెట్ కేటాయించాలని నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. రిజర్వేషన్ కలిసి వస్తే ఎంపీపీ, జెడ్పీ చైర్‌పర్సన్ పదవులను దక్కించుకోవాలని పలువురు యత్నిస్తున్నారు. అయితే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిపిన అనంతరం మున్సిపల్ ఎన్నికలు కూడా నిర్వహించనున్నారు.



## తెలుగు రాష్ట్రాల్లో చలి పంజా

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రాన్ని చలి వణికిస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు జిల్లాల్లో సింగిల్ డిజిట్ టెంపరేచర్ నమోదవుతోంది. ఆసిఫాబాద్ జిల్లాల్లో అత్యల్పంగా 5.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. దీంతో చలితో ప్రజలు వణికి పోతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. తెలంగాణలోని ఆసిఫాబాద్‌లో గురువారం తెల్లవారుజామున సంగారెడ్డిలో 6.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డిలో 6.5, ఆదిలాబాద్ 7.7, వికారాబాద్ 8.1, సిద్దిపేట 8.1, మెదక్ 8.5, కామారెడ్డి 8.6, నిర్మల్ 8.9, నిజామాబాద్ 9.1, నాగర్‌కర్నూల్ 9.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై ఆందోళన

**అక్షరటుడే, ఢిల్లీ:** ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై కాంగ్రెస్ నిరసన చేపట్టింది. గురువారం ఉదయం పార్లమెంట్ ఆవరణలో ఆ పార్టీ ఎంపీలు ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టింది. పాత చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్ ప్రవేశ పెట్టింది. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా గురువారం ఉదయం పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్‌తో పాటు విపక్ష ఎంపీలు నిరసన తెలిపారు.




## నాంపల్లి సీబీఐ కోర్టుకు బాంబు బెదిరింపు

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని నాంపల్లిలో గల సీబీఐ కోర్టుకు బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. కోర్టులో తనిఖీలు చేపట్టారు. కోర్టు ఆవరణలో బాంబు పెట్టినట్లు మెయిల్ వచ్చింది. దీంతో పోలీసులు కోర్టు సిబ్బంది, న్యాయవాదులను బయటకు పంపించారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. కాగా.. దేశంలోని పలు కోర్టులకు గతంలోనూ బాంబు బెదిరింపులు వచ్చాయి.

## సీఎం ప్రచారం చేసినా ప్రజలు షాక్ ఇచ్చారు: హరీశ్‌రావు



**అక్షరటుడే, మెదక్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచారం చేసినా.. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు షాక్ ఇచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో గురువారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఏ రాష్ట్రంలో అయినా అధికార పార్టీ సర్పంచులు 80 శాతం నుంచి 90 శాతం వరకు గెలుస్తారన్నారు. కానీ తెలంగాణలో ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ 4000కు పైగా సర్పంచులతో 30-40 శాతం పంచాయతీలు గెలిచిందన్నారు. సర్పంచ్ ఎన్నికలకు ముఖ్యమంత్రి స్థాయి వాళ్లు తిరగరని చెప్పారు. కానీ రేవంత్ రెడ్డి కాలికి బలపం కట్టుకొని జిల్లాల్లో ప్రచారం చేశారన్నారు. రేవంత్ రెడ్డి ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ.. జిల్లా జిల్లాకు తిరిగి ప్రచారం చేసినా బీఆర్ఎస్ 4 వేల సీట్లు గెలిచిందని చెప్పారు.

## బీజేపీ ఆఫీసులను ముట్టడించిన కాంగ్రెస్ నేతలు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని కాంగ్రెస్ నేతలు నిర్వహించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ ఇటీవల సోనియా గాంధీ, రాహుల్‌గాంధీపై ఛార్జ్‌షీట్ వేసింది. అయితే కోర్టు దానిని అనుమతించలేదు. దీంతో సోనియా, రాహుల్‌పై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపిస్తూ.. బీజేపీ కార్యాలయాలను ముట్టడించాలని ఏఐసీసీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా జిల్లా కేంద్రాల్లో బీజేపీ ఆఫీసులను ముట్టడించారు. బీజేపీ రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.

## 'ది రాజా సాబ్' హీరోయిన్‌కు చేదు అనుభవం..!



**హీరోయిన్ నిధి అగర్వాల్‌కు బుధవారం హైదరాబాద్‌లో జరిగిన 'ది రాజా సాబ్' 'సహానా సహానా' సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో చేదు అనుభవం ఎదురైంది. భారీగా తరలివచ్చిన అభిమానులు ఒక్కసారిగా ఆమెను చుట్టుముట్టడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఫ్యాన్స్ అత్యుత్సాహం హద్దులు దాటడంతో, బాడీగార్డులు అతి కష్టం మీద నిధిని సురక్షితంగా కారులోకి ఎక్కించాల్సి వచ్చింది. ఈవెంట్ ముగిసిన అనంతరం నిధి అగర్వాల్ బయటకు రాగానే అభిమానులు ఒక్కసారిగా దగ్గరకు వచ్చారు. బాడీగార్డులు అడ్డుకునే ప్రయత్నం చేసినా కొందరు వెనక్కి తగ్గకుండా సెల్ఫీల కోసం ఎగబడ్డారు. కొంతమంది ఆమెను తాకేందుకు కూడా ప్రయత్నించడంతో నిధి తీవ్ర అసహనానికి గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సంఘటనపై పలువురు సెలబ్రిటీలు స్పందిస్తూ ఫ్యాన్స్ ప్రవర్తనను ఖండిస్తున్నారు.** - అక్షరటుడే, సినిమాడెస్క్